# పల్లె బాల్యం

- భమిడిపాటి కామేశ్వరి

పల్లె బాల్యం మహద్భాగ్యం
అల్లరి పనుల ఆనందం
అమ్మచేతి చద్దన్నం
ఆరగించి కడుపార
ఎగురుతు దూకుతు
ఏటి ఒడ్డుకు చేరి అలలపై
రాళ్ళు రువ్వి మురిసే బాల్యం
పల్లె బాల్యం మహద్భాగ్యం

తోటి వారిని గూడి
చెట్టా పట్టాలేసుకు
చేల గట్ల వెంబడి
చెంగు చెంగున గెంతుచు
చెరువులోన దిగి ఈతకొట్టి
తానమాడి గొంతెత్తి పాడుకొంటు
గోల గోలగ యిల్లు జేరు బాల్యం
పల్లె బాల్యం మహద్భాగ్యం

పలకా బలపం బట్టి
పరుగుపరుగున
పాఠశాల జేరి
పంతులుగారికి
వందనమొనర్చి
అయ్యవారు నేర్పిన
అక్షరాలు దిద్ది
పాఠాలు వల్లెవేసి
బడి గంట కోసం
పడి పడి జూసి
గంట వినపడగనే
ఆట విడుపుగ
బయటపడు
పల్లె బాల్యం మహద్భాగ్యం

మామిడి తోటల్లో రాలిన
మామిడి పిందెలు
చింత తోపుల్లో చింతకాయలు
ఏరుకొని తింటు
పిల్లలందరు జేరి
ఆటల పాటల దేలుతు
ఇల్లు జేరు బాల్యం
పల్లె బాల్యం మహద్భాగ్యం

అమ్మ చేతి గోరు ముద్దలుగ
కమ్మని నేతి పప్పన్నం
మీగడ పెరుగన్నం
ప్రేమ మీర అమ్మ పదాలు పాడుతు
పెట్టగ గోముగ మారాము చేస్తూ
అమ్మ ముద్దుమురిపాలను
ఆరగించు పల్లె బాల్యం మహద్భాగ్యం

తోటి పిల్లల గూడి
తొక్కుడుబిళ్ళ
గోణెబిళ్ళాట
గోళీలాట
అష్టచమ్మ కబడి
పులి మేక వామన గుంటలాడుతు
గలగల గడిపే బాల్యం
పల్లె బాల్యం మహద్భాగ్యం



చిన్నారి చిటపట చినుకుల తడిసి
పారే నీటిలో కాగితంపు
పడవలు వేసి
చప్పట్లు కేరింతలతో
గడిపే బాల్యం
చీకు చింతా లేని
పల్లె బాల్యం మహద్భాగ్యం